## క్లుప్తంగా

### పశు వ్యాధుల నివారణకు చికిత్స



మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

**వెదురుకుప్పం:** పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధి నివారణకు చికిత్స అందించినట్లు వెదురుకుప్పం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకురాలు రూపసుందరి తెలిపారు. గురువారం మండలంలోని సంతబయలు గ్రామంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, నట్టల నివారణ, గాలికుంటు వ్యాధి వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రూ.20 వేలు విలువ చేసే మందులు, మినరల్ మిక్చర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డివిజన్ ఉప సంచాలకులు గోవిందయ్య, మండల పశువైద్యాధికారి రాజేష్, సంతబయలు సర్పంచ్ రాజేశ్వరి, సిబ్బంది గణేష్, రామదాస్, కావేరి, పాడిరైతులు పాల్గొన్నారు.

### హెల్మెట్‌తోనే సురక్షిత ప్రయాణం



ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప

**పాలసముద్రం:** ద్విచక్ర వాహనదారులు సురక్షితంగా గమ్య స్థానాన్ని చేరుకోవాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ లేక కిందపడడంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్టు వంటి వాటిని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. తప్పనిసరిగా అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చునే వ్యక్తికి కూడా హెల్మెట్ తప్పనిసరన్నారు. లేకుంటే రూ.1000 జరిమానా వేస్తారన్నారు. ఆటోడ్రైవర్లు రికార్డులు, యూనిఫామ్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఇన్సూరెన్స్ పొల్యూషన్ సర్టిఫికెట్లు ఉండాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, వాహనాలు నడిపినా భారీ జరిమానాలు తప్పంని హెచ్చరించారు.

### కానరాని కార్యదర్శులు

**విజయపురం:** మండలంలో పంచాయతీ కార్యదర్శులు కనిపించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సచివాలయంలో ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలో ఉంటున్నారు. సమస్యలపై ప్రతి విషయానికి ఫోన్ చేయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు సచివాలయానికి రాకుండానే సొంత పనులపై నగరి, పుత్తూరు వెళ్లుతున్నారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలు కార్యదర్శులు లేక వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

### న్యాయమూర్తిపై దాడికి నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

**నగరి:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది కిషోర్ రాకేష్ దాడి చేయడాన్ని ఖండిస్తూ జైభీమ్ సేన ఆధ్వర్యంలో గురువారం రాత్రి బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. దళిత సుప్రీంకోర్టు జడ్జిని అవమానించడం రాజ్యాంగాన్ని అవమానించడమేనంటూ నినాదాలు చేశారు. నగరి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ఆర్ బాబు మాట్లాడుతూ మతోన్మాదులను రెచ్చగొట్టి బీజేపీ, ఆర్ఎస్ఎస్ భజరంగ్ దళ్, ఏబీవీపీ సంస్థలు నిరంతరం దుశ్చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. వెంటనే మతోన్మాది కిషోర్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. జైభీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రన్, కాంగ్రెస్ నాయకులు గోపాల్, సతీష్, విజయ్, శేఖర్, సీపీఐ నాయకులు వేలన్, ప్రతాప్, న్యాయవాదులు వేలాయుధం, నాగరాజు, ఎం.బాబు, శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పిడుగుపాటుకు కొబ్బరిచెట్టు దగ్ధం

**విజయపురం:** మండలంలోని కేవీపురం దళితవాడలోని కొబ్బరి చెట్టుపై గురువారం రాత్రి పిడుగు పడింది. దీంతో సమీపంలోని ఇళ్లలోని ఏసీలు, 20 టీవీలు, 25 ఫ్యాన్‌లు 100కు పైగా విద్యుత్ బల్బులు కాలిపోయినట్లు స్థానిక తెలిపారు. ఆ పిడుగుపాటు శబ్దానికి ప్రజలు, మూగజీవాలు సైతం భయాందోళన చెందారు.

### వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

**గంగాధరనెల్లూరు:** పెద్ద కాలువ పంచాయతీ పరిధిలోని చెర్లోపల్లి సమీపంలో వ్యభిచార గృహంపై గురువారం ముందస్తు సమాచారంతో జీడీ నెల్లూరు సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా వ్యభిచార గృహం నిర్వాహకురాలితోపాటు ఇద్దరు మహిళలను, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఇదే స్థలంలో గత నాలుగు నెలల క్రితం కూడా వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సరుకుల్లేవు.. పో!




ప్రజలు నిత్యం వాడే సరుకుల్లో కంది పప్పు కూడా ఒకటి. కందిపప్పు ధర ఆకాశాన్నంటినప్పటికీ ప్రతి ఇంటిలో వారంలో రెండు నుంచి మూడు రోజులకు ఒకసారి కందిపప్పు వాడాల్సిందే. అలాంటి నిత్యావసర సరుకును గత ప్రభుత్వం పేదలకు ప్రతి నెలా రేషన్ వాహనాల ద్వారా సరఫరా చేసేది. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ చేయడం లేదు. లబ్ధిదారులు అడిగిన ప్రతిసారి వచ్చే నెల వస్తుందని డీలర్లు చెబుతున్నారే తప్ప వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. ఇంకా వివరాలు అడిగితే సరుకుల్లేవు పో అనే విసుర్లు డీలర్ల నుంచి తప్పడం లేదు.

- కార్డుదారులపై రేషన్ డీలర్ల విసుర్లు
- కానరాని కందిపప్పు
- రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ
- బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరల మోత
- పేద, మధ్య తరగతి ప్రజలు సతమతం

**తూకంలో అవినీతి**

నియోజకవర్గంలో నగరి, పుత్తూరు, విజయపురం, వడమాలపేట, నింద్ర మండలాల్లో 204 రేషన్ షాపులు, 71138 కార్డుదారులు ఉన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకు అందించాలి. అయితే ఒకటి రెండు షాపులు తప్ప మిగిలిన షాపుల డీలర్లు రెండు, మూడు రోజులు మాత్రమే సరుకులు అందించి, ఆ తరువాత వచ్చే వారికి సరుకులు అందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై తహశీల్దార్ వారికి చెప్పినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తూకంలో కూడా మోసాలు చేస్తూ, డీలర్లు ప్రజలను దోచుకొంటున్నారు. ఒక కార్డుకు 2 నుంచి 3 కిలోల వరకు తూకం తక్కువగా వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నియోజవర్గంలోని రేషన్ దుకాణాల వివరాలు**

| మండలం | షాపులు | కార్డులు | గోదాములు |
|---|---|---|---|
| నగరి | 66 | 26562 | 1 |
| పుత్తూరు | 42 | 20045 | 1 |
| విజయపురం | 33 | 5966 | |
| వడమాలపేట | 35 | 9796 | |
| నింద్ర | 28 | 8769 | |
| మొత్తం | 204 | 71138 | 2 |

### కంది కలవరం

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో ధర రూ.100 నుంచి రూ.140 వరకు ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితులు ఉన్నాయి. గత ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ప్రతి కార్డుకు కిలో కంది పప్పు అందించాలని పలువురు కోరుతున్నారు. కందిపప్పు సరఫరాపై కార్డుదారులు డీలర్ల వద్ద వాకబు చేస్తున్నా సరైన సమాధానం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కార్డుదారులు బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తే ఏం చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. కుటుంబానికి సరిపడా కందిపప్పు, వంట నూనె తదితర నిత్యావసర సరుకులు అందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద, మధ్య తరగతి ప్రజలు ఆవేదనను పరిగణనలోకి తీసుకుని రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, వంట నూనె సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

## సంఘాలతో ఆర్థికాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న రాస్ సంచాలకులు నాగరాజు

**పుత్తూరు:** మహిళా సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని రాస్ సంచాలకులు వి.నాగరాజు అన్నారు. గురువారం స్థానిక రాష్ట్రీయ సేవా సమితి(రాస్) కార్యాలయంలో పొదుపు సంఘాల సలహా కమిటీ లీడర్లకు శిక్షణా శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగరాజు మాట్లాడుతూ రాస్ సంస్థ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కార్యక్రమాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి కింద పలు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేతివృత్తుల్లో శిక్షణతోపాటు రుణాలను పొందుతున్న మహిళలు ఆ సొమ్మును ఆర్థిక కార్యక్రమాలపై వెచ్చించాలని సూచించారు. అప్పుడే ఆర్థికాభివృద్ధి సాధించడానికి సాధ్యపడుతుందని వివరించారు. సేవా దృక్పథం కలిగిన వారిని క్లస్టర్, సలహా కమిటీ లీడర్లుగా ఎంపిక చేస్తామన్నారు. మహిళల జీవనోపాధికి ఆదాయ వనరులు, అవకాశాలు, రుణాలు, నగదు వినియోగం, కుటుంబ బాంధవ్యాలను వివరించారు. కార్యక్రమంలో అన్ని క్లస్టర్, కమిటీ లీడర్లు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచాలి



నగరి ఏరియా ఆసుపత్రి వద్ద నిరసనలో ఆశ వర్కర్లు

**నగరి:** కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి ఆవరణలో గురువారం ఆశ వర్కర్లు వైద్యుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యుల న్యాయమైన కోరికను వెంటనే పరిష్కరించాలని కోరారు. వైద్యుల కోరికపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారని, ప్రజల ఆరోగ్యాలను, ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. వైద్యుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సెందామరై, నాయకులు విజయలక్ష్మి, రాజేశ్వరి, హంస, లక్ష్మి, ఇందిర, పుష్ప, జయప్రద, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్ధగిరి క్షేత్రానికి భారీ ఆదాయం

**తవణంపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.17.35 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మునిశేఖర్ తెలిపారు. గురువారం అర్ధగిరి క్షేత్రంలోని మండపంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్వేత పర్యవేక్షణలో హుండీ కానుకలను లెక్కించారు. జూన్ నెల 9వ తేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు 122 రోజులకు హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కించారు. హుండీల్లో భక్తులు ద్వారా బంగారు 3.600 మిల్లీ గ్రాములు, వెండి 102 గ్రాములు వచ్చినట్లు వెల్లడించారు. హుండీలో 122 రోజులకు రూ.17,35,350 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. నగదు, బంగారు, వెండిని బ్యాంకులో ఉంచినట్లు వివరించారు. లెక్కింపులో ఏపీ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఉమామహేష్, ఆలయ సిబ్బంది, రంజిత్ రెడ్డి, రఘుపతి, భక్తులు పాల్గొన్నారు.

# దిగుబడి బాటలు



వరిసాగులో కాలిబాటలు

**– వరిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు**

**విజయపురం:** వరి పొలంలో కాలిబాటలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చాలా మంది రైతులు కాలిబాటలపై ఆసక్తి చూపడం లేదు. అదనపు ఖర్చులు, కాలిబాట మార్గంలో వరి నాట్లు తొలగించడంతో దిగుబడి తగ్గుతుందన్న అపోహతో ఏర్పాటుకు దూరంగా ఉంటున్నారు. అయితే నాట్లు వేసిన పొలంలో రెండు మీటర్ల దూరంలో కాలిబాటలు వేయడంతో మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

**లాభాలు**

కాలిబాటలతో మొక్క వేరు భాగానికి గాలి, సూర్యరశ్మి బాగా తగిలి చీడపీడల సమస్య తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందులు చల్లడానికి అనువుగా ఉంటుంది. కాలిబాటల వెంట తిరుగుతూ ఎరువులు, పురుగు మందులు చల్లితే ప్రతి వరి దుబ్బుకు అందించడానికి అనువుగా ఉంటుంది. దీంతో ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాల మేర అదనంగా దిగుబడి సాధించే అవకాశం ఉందని చెబుతున్నారు. చీడపీడల బెడద కొంతవరకూ తగ్గుతుంది. కలుపు తొలగించడానికి, తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తే సులభంగా గుర్తించడానికి, ఎలుకల నివారణకు అనువుగా ఉంటుంది. తుపాన్లు, భారీ వర్షాలు తదితర ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థంగా జరిగి దిగుబడి తగ్గకుండా కాలిబాటలు ఉపయోగపడుతాయి. వ్యవసాయ సిబ్బంది కాలి బాటల ప్రయోజనాలు రైతులకు వివరించడంతో ఇటీవల బాటలు వేసే రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

**కాలిబాటలు వేసే విధానం**

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ లేదా కొబ్బరి డొక్కుతాడు తీసుకుని చేను గట్టుకు ఒక వైపు నుంచి మరోవైపు గట్టుకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంట 12 సెంటీమీటర్ల వెడల్పున వరినాట్లు తొలగించాలి. ఈ నాట్లు పొలంలో పల్చగా ఉన్న ప్రాంతాల్లో నాటుకోవచ్చు. వెద జల్లే పద్ధతిలో సాగు చేసేవారు విత్తనాలు చల్లిన 15 రోజుల నుంచి 20 రోజుల వ్యవధిలో వరిమొక్కలు తొలగించి కాలిబాటలు వేసుకోవాలి.

### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు



ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

**కార్వేటినగరం:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కును బీజేపీ, భారత్ ఎన్నికల కమీషన్ ఖూనీ చేస్తున్నాయని జీడీనెల్లూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఓట్ల దొంగతనాన్ని అరికట్టడానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. బీజేపీ సీనియర్ నాయకుడు, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు శివలింగం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌతంరాజు, రాజేశ్వరమ్మ, శివకుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, ప్రిన్స్ క్రిష్ణమూర్తి, గోవర్ధన్‌రెడ్డి, దొరస్వామిరాజు, చిన్నబ్బరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డీసీసీబీ ఖాతాదారులు ఈకేవైసీ చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ గోమతి

**పాలసముద్రం:** మండల పరిధిలోని డీసీసీ బ్యాంకు ఖాతాదారులు తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలని ఆ బ్యాంక్ మేనేజర్ గోమతి తెలిపారు. గురువారం సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో సీఈఓ వెంకటమణి ఆధ్వర్యంలో డీసీసీ బ్యాంకు ఖాతాదారులకు, రైతులకు రుణాలు, ఈకేవైసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ గోమతి మాట్లాడుతూ రైతులకు తక్కువ వడ్డీతో పట్టా భూములు, బంగారు నగలపై కూడా తక్కువ వడ్డీలకు రుణాలు ఇస్తామని తెలిపారు. బ్యాంకుల్లో వివిధ రుణాలు తీసుకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాభూని, సిబ్బంది జయచంద్ర, రామ్‌దాస్, రైతులు పాల్గొన్నారు.

### ఎలక్ట్రిక్ బైక్ విరాళం

**కాణిపాకం:** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి గురువారం శ్రీ వేంకటేశ్వర ఎలక్ట్రిక్ బైక్స్ ప్రకాష్ ఎలక్ట్రికల్ ఎక్స్‌టెన్షియల్ టూ వీలర్ బైక్ విరాళంగా ఇచ్చారు. రూ.50 వేలు విలువ చేసే ఈ ఎలక్ట్రికల్ బైక్‌ని ఈఓ పెంచల కిషోర్ చేతికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డిప్యూటీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు తగదు



మాట్లాడుతున్న జీడీ నెల్లూరు వైఎస్ఆర్ సీపీ నాయకులు

**గంగాధరనెల్లూరు:** మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై జీడీనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే థామస్ రెండు రోజుల క్రితం చేసిన అనుచిత వ్యాఖ్యలను మండల వైఎస్ఆర్ సీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి పలు మండలాల నాయకులతో కలసి గురువారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గత ప్రభుత్వంలో సీఎం సొంత నియోజకవర్గం పులివెందులకు దీటుగా జీడీనెల్లూరును అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. 180కి పైగా ఆలయాలకు మహర్దశ కలిగించారని, అర్చకులకు ఆలయాలకు జీతభత్యాలు అందించేలా కృషి చేశారన్నారు. అయితే ప్రస్తుత కూటమి థామస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ ఏకవచనంతో సంబోధిస్తూ, నానా దుర్భాషలాడడం మంచి పద్ధతి కాదన్నారు. అవినీతి మచ్చ అంటని ఏకైక నాయకుడు నారాయణస్వామి అని అన్నారు. మరో మారు ఇలాంటి చౌకబారు మాటలు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. అభివృద్ధిలో పోటీ పడితే స్వాగతిస్తామని, అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకునేలా పోరాడుతామని అన్నారు. గుణశేఖర్ రెడ్డి, హరిబాబు, కిషోర్ రెడ్డి, విజయకుమార్ రెడ్డి, ఏకాంబరం, వెంకటేష్ రెడ్డి, ఢిల్లీ కుమార్, గోవర్ధన్ రెడ్డి, వేలు మొదలియార్, కేశవరెడ్డి, శేఖర్, వెంకటేష్, జగదీష్ బాబు, విష్ణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- పేదలకు ఇస్తామన్న ఏటీఎం స్క్రాచ్‌కార్డ్ డబ్బులు ఏమయ్యాయి
- అభివృద్ధిపై దృష్టి పెట్టి, దోపిడీని అరికట్టండి



మాట్లాడుతున్న కుప్పయ్య

**శ్రీరంగరాజపురం:** మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిని ఏకవచనంతో అసభ్యకరమైన రీతిలో మాట్లాడడం ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే థామస్ స్థాయిని దిగజారుస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలని ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్ సీపీ క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అసభ్యకరంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నడూ లేని విధంగా మాజీ మంత్రి నారాయణస్వామి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యే కాకముందు చెన్నైలో క్రిమినల్ కేసు నమోదు కాలేదా? జైలుకు వెళ్లలేదా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజలను ఏటీఎం స్క్రాచ్ కార్డుల పేరుతో రూ.5000 వేలు ఇస్తామని నమ్మబలికి, అధికారంలోకి వచ్చాక ఇంతవరకు ఒక్కరూపాయి కూడా చెల్లించలేదని, ప్రజలను మోసం చేశారన్నారు. ప్రకృతి సంపద ఇసుక, గ్రావెల్, గ్రానైట్ అక్రమంగా సరిహద్దు రాష్ట్రాలకు తరలిపోతున్నాయని, ఈ దోపిడీని అడ్డుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత జనార్ధన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్‌రాజ్, నాయకులు హరిరెడ్డి, సెల్వరాజ్, సతీష్, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు సమయపాలన పాటించాలి



ఎంపీడీఓ సతీష్ కుమార్‌కి సమస్యలు వివరిస్తున్న సర్పంచ్ జి.మహేష్

**పాలసముద్రం:** మండల పరిధిలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయాన్ని లాయన సందర్శించారు. ఎంపీడీఓ సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ సచివాలయానికి సమస్యలపై వచ్చిన వారితో మంచిగా మాట్లాడి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సర్పంచ్ గాలి మహేష్‌బాబు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పశువుల దాహం కోసం కట్టిన నీటితొట్టిల వివరాలు, కట్టిన నీటి తొట్టిలకు పైప్‌లైన్ వేసి నీరు వదలడం లేదని తెలిపారు. పంచాయతీ తీర్మానం లేకుండానే ఉపాధిహామీ సిబ్బంది పాడి పశువులకు నీటి తొట్టిలు కట్టారని ఆరోపించారు. ఒక నీటి తొట్టె పని కూడా పూర్తి చేయలేదన్నారు. అయితే బిల్లులు మాత్రం పెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సింహరాజుపురం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి దూరం కావాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**కార్వేటినగరం:** విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్‌కౌన్సిలర్ టి.సౌజన్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో స్టేట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ చాయేంద్ర, జిల్లా జీసీడీఓ ఇంద్రాణి ఆదేశాల మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పాఠశాల హెచ్‌ఎం చెంగల్‌రాజు ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పోస్టర్ మేకింగ్ పోటీలు, అలాగే మైండ్ రిలాక్సేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, వ్యాకులత, అసాధారణ ప్రవర్తన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మానసిక ఆరోగ్య ప్రాధాన్యంపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో చైతన్యం కలిగించారు. అదే విధంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యాన్ని, ఎలా కాపాడుకోవాలి, ఒత్తిడిని ఎలా అధిగమించాలనే అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి.వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిచ్చిమొక్కలు తొలగించండి



బుగ్గకాలువపై పెరిగిన పిచ్చిమొక్కలు

**విజయపురం:** బుగ్గఆగ్రహారం నుంచి కాళికాపురం, గంగమాంబపురం మంగళకండ్రిగ మీదుగా వెళ్లే బుగ్గకాలువ ఇరు పక్కల పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాలువకు ఇరు పక్కలా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో వర్షపు నీరు చెరువులోకి చేరడం లేదన్నారు. కాలువ ఎక్కడ ఉందోనని కూడా తెలియడం లేదు. అలాగే పిచ్చి మొక్కలు ఉండడంతో విషసర్పాలకు నిలయంగా మారిందని రైతులు అంటున్నారు. వర్షకాలంలో వర్షపునీరు బుగ్గకాలువ ద్వారా చెరువులోకి చేరినప్పుడు చిల్లకాలువ ద్వారా పంటలకు నీరు అందుతుంది. అలాగే రానున్న రోజుల్లో వర్షపు నీరు చెరువులోకి చేరేలా కాలువకు ఇరు పక్కలా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ



మెమోరండం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

**నగరి:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాల్ని ఈ నెల 10వ తేదీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నగరి ఏఈఓ నమశ్శివాయకు మెమోరండం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.నాగభూషణం, జి.లక్ష్మీనారాయణ, రవీంద్రబాబు, సంతోష్ కుమార్, కె.గిరిబాబు, గంగా మోహన్, వసంత్, గణేష్, పురుషోత్తం, మహేంద్ర, కుమార్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.